
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు
బుధవారం 25 డిసెంబరు 2024



జనం మెచ్చేలా సంక్షేమం

- ఒక ఏడాది.. రెండు ప్రభుత్వాలు
- అధికారంలోకి చంద్రబాబు
- వైఎస్ జగన్‌కు బిగ్ షాక్
- వారం రోజుల్లో ముగియనున్న 2024




2024... ఈ ఏడాది ఇటు ప్రజలకు.. అటు రాజకీయ నాయకులకు చాలా ప్రత్యేకం. మరీ ముఖ్యంగా తెలుగుదేశం, వైసీపీలకు తీర్పు ప్రకటించిన ఏడాది. ఆ రెండు పార్టీలకు చేదు, తీపి అనుభవాలు పంచిన వెరీ స్పెషల్ ఇయర్ వారం రోజుల్లో కాలగర్భంలో కలిసిపోనుంది. 2024 సంవత్సరం రెండు ప్రభుత్వాలను చూసింది. మొదటి ఆరు నెలలు జగన్ హయాంలోని వైసీపీ పాలన సాగింది. ఆ తర్వాత చంద్రబాబు హయాంలోని ఎన్డీయే కూటమి పాలన వచ్చి కొనసాగుతోంది. ఈ ఏడాది కూటమి నేతలకు కలసి వస్తే.. వైసీపీ అధినేత జగన్ మాత్రం ముఖ్యమంత్రి పదవిని కోల్పోయారు. మొత్తం మీద మొదటి ఆరు నెలలు.. తర్వాతి ఆరు నెలల సంక్షేమ పాలనపై ఆంధ్రజ్యోతి 2024 రౌండప్ కథనం.

6లో

రాష్ట్రాన్ని నాశనం చేసిన జగన్


- 2029లో పులివెందులలో జగన్ ఓటమి ఖాయం
- కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



కర్నూలు అర్బన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): 'ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని నాశనం చేశావు.. ఐదేళ్ల అరాచకాలకు ప్రజలు 11 సీట్లకు సరిపెట్టారు. అయినా జగన్‌లో బుద్ధిరాలేదు..' అని కుడా చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబును 2029లో సింగిల్ డిజిట్లకు పరిమితం చేస్తానన్న జగన్ వ్యాఖ్యలపై సోమిశెట్టి చురుకైన విమర్శలు చేశారు. జగన్‌కు దమ్ముంటే 2029లో పులివెందుల నుంచి గెలవాలని సవాల్ విసిరారు. తన కేడర్ ఎక్కడ దూరమవుతుందోనని ఇలాంటి కామెంట్లు చేస్తూ మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నాడని ఆరోపించారు. జగన్‌తో పాటు ఆయన పార్టీ మాటలను నమ్మి ప్రజలు మరోసారి మోసపోయేందుకు సిద్ధంగా లేరన్నారు. ఐదేళ్ల అధికారంలో రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా సైంధవుడిలా మారాడన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో యువత గంజాయి, మత్తు పదార్థాలకు బానిసయ్యారని అన్నారు. రాష్ట్రం కోసం రేయింబవళ్లు కష్టపడుతున్న చంద్రబాబును ప్రజలు నమ్మకంతో ఆశీర్వదించారన్నారు. అందుకే రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు వస్తున్నాయన్నారు. ఇకపై చౌకబారు రాజకీయాలు మానుకోవాలని జగన్‌కు సోమిశెట్టి హితవుపలికారు.


దయామయుని మార్గం...
శాంతియుత జీవనం

నేడు 'క్రిస్మస్'


ఆత్మకూరులో ముస్తాబైన చర్చి

నంద్యాల కల్చరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సమస్త మానవజాతి సుఖశాంతులతో జీవించాలని ఉద్బోధించిన మహనీయుడు యేసుక్రీస్తు. ప్రేమతత్వంతో, కరుణాగుణంతో, దయార్థ్ర భావనలతో పొరుగువాడి పట్ల ఆప్యాయత కలిగి ఉండాలని ప్రబోధించి, మానవజాతి పాప పరిహారం కోసం తాను శిలువ మోసిన చారిత్రక పురుషుడు క్రీస్తు. ఆ మహనీయుని పుట్టినరోజు వేడుక 'క్రిస్మస్' పండుగను బుధవారం ఉమ్మడి జిల్లాలోని క్రైస్తవులు ఘనంగా నిర్వహించుకోనున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక క్రిస్మస్ ప్రార్థనలకు అన్ని క్రైస్తవ మందిరాలు ముస్తాబయ్యాయి. రంగు రంగుల విద్యుద్దీపాలతో చర్చిలను ఆకర్షణీయంగా తీర్చి దిద్దారు. చర్చిలపై నక్షత్రాలను ఎగురవేశారు. కొన్ని చర్చిలలో క్రీస్తు జననానికి సంకేతంగా ఆయన పుట్టిన పశువుల పాక నమూనాలు అందంగా అలంకరించారు.


నంద్యాలలో ముస్తాబైన ముత్తయి చర్చి


నంద్యాల పట్టణంలోని మత్తయి చర్చిలో పశువుల పాకలో బాలయేసు జననం



నంద్యాల పట్టణం నందమూరి నగర్‌కు చెందిన ఈ వ్యక్తి పేరు మహమ్మద్ హసేన్. ఎస్సార్బీసీ కాలనీలో వీరి కుటుంబానికి ఆరేళ్ల క్రితం అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎస్సార్బీసీ కాలనీలోని టిడ్కో గృహాల్లో డబుల్ బెడ్ రూం కేటాయించింది. అప్పట్లోనే రూ.3.60 లక్షల బ్యాంకు లోను కూడా వచ్చింది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ఇంటిని వీరికి అప్పజెప్పకపోవటంతో వీరికి సొంత ఇంటి కల నెరవేరలేదు. కానీ బ్యాంకులో లోను మంజూరు అయినందుకు మాత్రం వడ్డీ పెరుగుతోంది. ఇటీవలే బ్యాంకు అధికారులు ఫోను చేసి వడ్డీ రూ.40 వేలు అయిందని చెప్పటంతో.. ఇల్లు చేతికి రాకుండానే వడ్డీ గోల ఏమిటంటూ ఆవేదన చెందుతున్నాడు.

నంద్యాలకు చెందిన ఓ లబ్ధిదారుడికి ఎస్సార్బీసీ కాలనీలో టిడ్కో ఇల్లు వచ్చింది. సొంత ఇల్లు అనే ఉద్దేశంతో అక్కడ చేరాడు. నాలుగో తరగతి చదువుతున్న తన కొడుకును పాఠశాలకు పంపించడానికే నెలకు వేలల్లో ఖర్చు వస్తోంది. పూసలు అమ్మి కుటుంబాన్ని పోషించే తనకు పాఠశాల రవాణా ఖర్చు భరించలేక తన కొడుకును చదువు మాన్పించాడు. నంద్యాలలోని టిడ్కో లబ్ధిదారులు ఎలాంటి కష్టాలు పడుతున్నారో తెలియజేయటానికి ఈ రెండు ఘటనలు చాలు. పేదల సంక్షేమం గురించి అరిగిపోయిన రికార్డుల మాదిరి చెప్పిన గత వైసీపీ ప్రభుత్వం ఘనకార్యానికి ఈ ఘటనలు ఈ ఘటనలు సాక్ష్యాలుగా నిలుస్తాయి.

కర్నూలు నగరం జగన్నాథగట్టులో నిర్మించిన ఏపీ టిడ్కో ఇళ్లు



టిడ్కో ఇళ్లు.. ఇంకెన్నాళ్లు..?

పట్టణ పేదలకు సొంతింటి కల నిజం చేయాలని గత టీడీపీ ప్రభుత్వం ఏపీ టిడ్కో ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 52,318 ఇళ్లు మంజూరు చేసింది. దాదాపుగా 23,645 టిడ్కో ఇళ్ల నిర్మాణాలు 90 శాతానికి పైగా పూర్తయ్యాయి. 2019 మేలో జగన్ సారథ్యంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక టిడ్కో ఇళ్ల వ్యవహారం వెనక్కిపోయింది. రూ. వందల కోట్లు ఖర్చు చేసి నిర్మించిన ఇళ్లు నిరుపయోగంగా మారాయి. ముళ్లకంప పెరిగింది. ఇనుప కడ్డీలు తుప్పు పట్టాయి. ఇళ్లలో దొంగలు పడి విద్యుత్ వైర్లు దోచుకెళ్లారు. మళ్లీ టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి. ఈ ప్రభుత్వం వచ్చి ఆరు నెలలైనా పట్టించుకోకపోవడంతో .. టిడ్కో ఇళ్లు ఎప్పుడిస్తారని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. గతంలో ఇళ్లలో చేరిన పేదలు తాగునీరు, రోడ్లు, రవాణా.. వంటి సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారు. కొందరు ఖాళీ చేసి వెళ్లిపోయారు. ఏపీ టిడ్కో ఇళ్ల దుస్థితిపై ఆంధ్రజ్యోతి క్షేత్రస్థాయి పరిశీలన కథనం.

నంద్యాల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గూడులేని పేదలకు పక్కా ఇళ్లు కట్టించేందుకు అప్పట్లో టీడీపీ ప్రభుత్వం పూనుకుంది. లబ్ధిదారులను ఎంపిక చేసి, ఇంటి నిర్మాణాలను కూడా ప్రారంభించింది. ఇందులో భాగంగా నంద్యాల పట్టణంలోని నందమూరి నగర్ 3,904 ఇళ్లు, ఎస్‌ఆర్‌బీసీ కాలనీలో 3,824, అయ్యలూరి మెట్టలో 2,272 ఇళ్లను వెరసి 10 వేల ఇళ్లను నిర్మించింది. దీనికి తోడు ఆళ్లగడ్డ, డోన్‌లో కూడా టిడ్కో ఇళ్లను ప్రారంభించింది. వీటిల్లో 300 చదరపు అడుగులు, 365 చదరపు అడుగులు, 430 చదరపు అడుగుల లెక్కన ఫ్లాట్లను కట్టించి లబ్ధిదారులకు అందించేందుకు నిర్ణయించింది. ఇంటి నిర్మాణాలను దాదాపు 85 శాతం అప్పటి టీడీపీ ప్రభుత్వం పూర్తి చేసింది. కేవలం విద్యుత్, నీటి సరఫరా, డ్రైనేజీ, రోడ్లు, ఇళ్లకు రంగులు వేసే పనులు మాత్రమే మిగిలిపోయాయి. ఇదే సమయంలో ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడం వెంటనే జరిగిపోయాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్లను పట్టించుకోవడం మానేసింది. అయితే వందల కోట్లు ప్రజాధనం ఖర్చు చేసి నిర్మించిన ఇళ్లు పంచకపోవడమేమిటని, ఇది లబ్ధిదారులను మోసం చేయడమేనన్న విమర్శలు వైసీపీ ప్రభుత్వంపైన ఎక్కువయ్యాయి. దీంతో జగన్ ప్రభుత్వం గతంలో అయిష్టంగానే పనులు మొదలు పెట్టినా, పూర్తి చేయలేకపోయింది.


నంద్యాల ఎస్సార్బీసీ కాలనీలోని టిడ్కో గృహాలు

వైసీపీ ఐదేళ్ల నిర్లక్ష్యం.. పేదలకు శాపం

2019 మేలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడడంతో ఏపీ టిడ్కో ఇళ్ల పంపిణీ వ్యవహారం ఆగిపోయింది. ఉమ్మడి జిల్లాలో మంజూరైన 52,318 ఇళ్లలో టెండర్లు జరిగి పనులు మొదలు పెట్టని 21,038 ఇళ్లను రద్దు చేశారు. మిలిగిన 31,289 ఇళ్లలో 23,645 ఇళ్లు టీడీపీ ప్రభుత్వ కాలంలో 90 శాతానికి పైగా పూర్తయ్యాయి. కొన్ని ఇళ్లు గృహ ప్రవేశాలకు సిద్ధం చేశారు. 2,500 ఇళ్లకు రివర్స్ టెండరింగ్ పద్ధతిలో టెండర్లు పూర్తి చేసినా పనులు మొదలు పెట్టలేదు. అయితే.. కొన్నాళ్లకు టిడ్కో ఇళ్ల పంపిణీ పేరిట నాటి వైసీపీ ప్రభుత్వం హడావుడి చేసింది. 23,645 ఇళ్లకు గాను 7,007 ఇళ్ల లబ్ధిదారులకు తాళాలు అప్పగించారు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో నేటికి 150-200 ఇళ్లలో కూడా లబ్ధిదారులు నివసించడం లేదు. నందికొట్కూరు, ఆత్మకూరు పట్టణాల్లో ఫేజ్-4లో మంజూరు చేసిన 3,800 టిడ్కో ఇళ్లు వైసీపీ హయాంలో రద్దు చేశారు. రూ.వేల కోట్లు ఖర్చు చేసిన ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన ఇళ్లు నిరుపయోగంగా మారాయి. శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. కర్నూలు నగరంలో టిడ్కో ఇళ్లలో దొంగలు పడి పలు అపార్ట్‌మెంట్లలో విద్యుత్ వైరు దోచుకెళ్లారు. ఆ ఇళ్లలో నేటికి విద్యుత్ వైరింగ్ చేయలేదు.

మిగతా 6లో..


నంద్యాల: అయ్యలూరులో టిడ్కో ఇళ్ల దుస్థితి

1న శ్రీశైలంలో స్పర్శ దర్శనం రద్దు

శ్రీశైలం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానంలో వచ్చే నెల 1న స్వామివారి స్పర్శదర్శనం, ఆర్జిత అభిషేకాలు నిలుపుదల చేస్తునట్టు దేవస్థానం అధికారులు తెలిపారు. ఆర్జిత గర్భాలయ అభిషేకాలు, ఆర్జిత సామూహిక అభిషేకాలు, ఉదయాస్తమాన సేవ, ప్రాతఃకాలసేవ, ప్రదోషకాల సేవలు నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. సర్వదర్శనం క్యూలైన్లలోని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా భక్తులందరికీ త్వరితగతిన స్వామి, అమ్మవార్ల దర్శనం కల్పించడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

సాగునీటి పథకాలను
సద్వినియోగం చేసుకోండి


వాటర్ షెడ్ పథకాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజకుమారి

సంజామల, డిసెంబరు 24: చెరువులు, వాగులు, వంకలు, రిజర్వాయర్లు, వాటర్ షెడ్‌కు సంబంధించిన ప్రతి సాగునీటి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి రైతులను సూచించారు. మంగళవారం 2024కు సంబంధించి రూ.2.50 కోట్లతో నిర్మించిన వాటర్ షెడ్ పథకాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో పర్యటించి పథకం పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయాన్ని సందర్శించారు. అనంతరం రైతులతో ఏర్పాటైన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రతి ఎకరాకు సాగునీటిని అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చిస్తుందన్నారు. డీడబ్ల్యూఎంఏ వాటర్ షెడ్‌కు సంబంధించి ఆకుమళ్ల గ్రామంలోనే రూ. 2.50కోట్లు వెచ్చించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిమ్మయ్య, రమణా రెడ్డి, పుల్లారెడ్డి, రాఘవేంద్ర రెడ్డి, యూనిస్ బాషా, మహేశ్వర రెడ్డి, డ్వామా పీడీ జనార్దన్, ఏపీడీ మాధవి లత, ఆర్డీఓ చల్లా విశ్వనాథ్, ఈఓ హేమలత, ఎంపీడీఓ రాధికారెడ్డి, ఏపీఓ సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అమరావతికి చేరిన
నాపరాయి సమస్య


- గనుల శాఖ మంత్రి, అధికారులతో మంత్రి బీసీ భేటీ
- ఆంధ్రజ్యోతి వరుస కథనాలతో ప్రభుత్వంలో కదలిక

బనగానపల్లె/ కొలిమిగుండ్ల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నంద్యాల జిల్లాకు చెందిన నాపరాయి సమస్య అమరావతికి చేరింది. ఈనెల 16న కన్సిడరేషన్ ఫీజు వసూలుకు మైనింగ్ శాఖ ఆదేశించడంతో జిల్లాలో నాపరాయి రవాణా స్తంభించింది. దీంతో గని యజమానులు, కార్మికులు ఉపాధి కోల్పోయారు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడింది. లాది మంది జీవన్మరణ సమస్యకు గురికావడంతతో ఆంధ్రజ్యోతి వరుస కథనాలను ప్రచురించింది. దీంతో స్పందించిన మంత్రి బీసీ జనార్దనరెడ్డి నాపరాయి కార్మికుల దీక్షా శిబిరాన్ని సందర్శించి, సమస్య పరిష్కారానికి చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగా మంగళవారం నంద్యాల జిల్లాకు చెందిన రాయలసీమ మైనర్ మినరల్ అసోసియేషన్, నాపరాయి గనుల సంఘం, పాలిషింగ్ యూనిట్ అసోసియషన్ ప్రతినిధులతో కలిసి గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, గనులశాఖ ముఖ్య కార్యదర్శి ముఖేశ్‌కుమార్ మీనా, గనుల శాఖ డైరక్టర్ ప్రవీణ్‌కుమార్‌లతో భేటీ అయ్యారు. నాపరాయి పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలు, స్థితిగతులు, ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాలను గనుల శాఖ మంత్రికి వివరించారు. దీనిపై స్పందించిన గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తక్షణమే మనోసారి మైనింగ్ శాఖ ఉన్నతాధికారులతో చర్చించి, సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీఇచ్చారు.


గనుల మంత్రి వినతిపత్రం అందిస్తున్న మంత్రి బీసీ, నాపరాయి పరిశ్రమ వర్గాలు

జనం మెచ్చేలా సంక్షేమం

- అవ్వా తాతలకు రెట్టింపు భరోసా ఇచ్చిన టీడీపీ కూటమి
- వృద్ధులకు రూ.4 వేలు.. దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్
- పేదల ఆకలి తీరుస్తున్న 'అన్న క్యాంటిన్లు'
- పేద మహిళలకు దీపం-2 కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు
- ఆరు నెలల్లో జనం మెచ్చేలా సంక్షేమం
- ఒక్కొక్కటిగా 'సూపర్ సిక్స్' పథకాల అమలు









2024.. మరో వారం రోజుల్లో కాలగర్భంలో కలిసిపోనుంది. 2025 నూతన సంవత్సరంలో అడుగు పెట్టేందుకు యావత్ ప్రపంచం సిద్ధమవుతోంది. ఈ ఏడాది ఆరంభం ఎన్నికల హడావుడితో మొదలైంది. ప్రజలను ఆకట్టుకోవడానికి రాజకీయ పార్టీలు తోచిన హామీలు గుమ్మరించాయి. ఆ క్రమంలోనే ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ కూటమి పార్టీలు సంక్షేమం.. అభివృద్ధి రెండు కళ్లు..! అంటూ సూపర్ సిక్స్ వరాలు ప్రకటిస్తే.. ఇవి అమలు అసాధ్యం..! అంటూ అధికార పక్షం వైసీపీ తేల్చేసింది. ప్రజలు చంద్రబాబు సారథ్యంలోని కూటమిని విశ్వసించారు. అధికారం ఇచ్చారు. టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఆరు మాసాలు పూర్తి చేసుకుంది. మరో ఏడు రోజుల్లో 2024 సంవత్సరం కనుమరుగై.. 2025 నవ వసంతం ఉదయించనుంది. ఈ సందర్భంగా ఏడాది ప్రారంభం ఆరు నెలల్లో వైసీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం.. చివరి ఆరు నెలల్లో టీడీపీ కూటమి ప్రభుత్వం జనం మెచ్చేలా సంక్షేమంపై ఆంధ్రజ్యోతి విశ్లేషణ.

పేదల ఇంట దీపం-2 వెలుగులు

టీడీపీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీల్లో ఒకటి దీపం-2. ఈ పథకం కింద పేదింటి మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చారు. రేషన్ కార్డు కలిగిన పేదలు అర్హులు. నవంబరు ఒకటో తారీఖు నుంచి అమలుకు శ్రీకారం చుట్టారు. భారత్, హెచ్‌పీ, ఇండెన్ గ్యాస్ కనెక్షన్లు కలిగిన 6.46 లక్షల కుటుంబాలకు ఏటేటా మూడు గ్యాస్ సిలిండర్లు అందించి దీపం-2 వెలుగులు విరబూయించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఉచిత గ్యాస్ సిలిండరు కోసం 2025 మార్చి 31వ తేది వరకు గ్యాస్ సిలిండరు బుకింగ్ చేసుకోవచ్చు. గ్యాస్ కనెక్షన్ ఉన్న తెల్లరేషన్ కార్డుదారులు అందరూ అర్హులే. 2025 ఏప్రిల్ ఒకటో తారీఖు నుంచి మూడు విడతల్లో ఏడాది మూడు గ్యాస్ సిలిండర్ల మొత్తం రూ.2,595 (ఒక్కో సిలిండర్ రూ.865) లబ్ధిదారుడి ఖాతాలో జమ చేస్తారు. ఏప్రిల్, మే, జూన్, జూలై నెలల్లో ఒక సిలిండర్, ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు నెలల్లో రెండో సిలిండర్, డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో మూడో సిలిండర్ నగదు జమ చేస్తారు. జిల్లాలో రూ.63.83 కోట్లు ఉచిత గ్యాస్ సిలిండర్ల రూపంలో పేదలకు ఆర్థిక ప్రయోజనం అందనుంది.

కర్నూలు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): 2024 సంవత్సరం ముగిసిపోనుంది. ఎవరి మనసులోనైనా ఈ ఏడాదికి సంబంధించిన ఎన్నో అనుభవాలు పదిలంగా ఉంటాయి. ఈ ఏడాది మధ్యలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న అభాగ్యుల ముంగిట చంద్రోదయమే అని చెప్పాలి. ఎన్నికల ముందు వృద్ధులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు పెంచుతామని చంద్రబాబు సారథ్యంలోని టీడీపీ కూటమి స్పష్టమైన హామీ ఇచ్చింది. అంతేకాదు.. ఏప్రిల్ ఒకటో తారీఖు నుంచి పెంపును అమలు చేసి అధికారం చేపట్టగానే ఆ మూడు నెలల బకాయి కూడా చెల్లిస్తామని హామీ ఇచ్చారు. చంద్రన్న మా ఇంటి కి కొండంత అండగా ఉంటారని అభాగ్యులు విశ్వసించారు. జూన్ 12న సీఎం చంద్రబాబు బాధ్యతలు చేపట్టగానే తొలి సంతకం పింఛన్ పెంపు ఫైల్‌పైనే పెట్టారు. జూలై ఒకటో తారీఖున ఊరూ వాడా పింఛన్ల జాతర జరుపుకున్నారు. జిల్లాలో 2,45,229 మంది పింఛన్‌దారులకు పెంచిన ఫించన్‌తో కలిపి రూ.104.10 కోట్లు, మూడు నెలల బకాయి రూ.63.25 కోట్లు కలిపి రూ.167.35 కోట్లు పంపిణీ చేశారు. ప్రతి నెల ఒకటో తారీఖున సూర్యోదయం వృద్ధులు, దివ్యాంగులు, వితంతు మహిళలకు చంద్రోదయం అవుతుంది. సచివాలయం, పంచాయతీ సెక్రెటరీలు, ఎంపీడీవో ఆఫీసు జూనియర్ అసిస్టెంట్లు 4,851 మంది నెలనెల ఒకటో తారీఖు ఉదయం 6 గంటలకే వృద్ధుల ఇంటి తలుపుతట్టి పింఛన్ డబ్బులు అందజేస్తున్నారు.

జిల్లాలో పింఛన్‌దారులు, అందుకునే నెల పింఛన్ వివరాలు (రూ.లల్లో)

కేటగిరి	లబ్ధిదారులు	ఒకరికి పింఛన్	మొత్తం (రూ.కోట్లల్లో)
వృద్ధులు	1,25,848	4,000	50.34
వితంతువులు	71,498	4,000	28.60
దివ్యాంగులు	31,434	6,000	18.86
చేనేత కార్మికులు	2,945	4,000	1.18
గీత కార్మికులు	242	4,000	0.10
ట్రాన్స్ జండర్స్	241	4,000	0.09
ఒంటరి మహిళలు	5,881	4,000	2.35
మత్స్యకారులు	816	4,000	0.33
దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు	346	10,000	0.35
డప్పు కళాకారులు	1,456	4,000	0.58
పక్షవాతం బాధితులు	781	15,000	1.17
కళాకారులు, సైనికులు	46	4,000-5,000	0.02
అభయ హస్తం	2,559	500	0.13
మొత్తం	2,45,229	---	104.10

రూ.వెయ్యి పెంచేందుకు ఐదేళ్లు



రాష్ట్ర విభజన తరువాత రూ.200 పింఛన్ ఐదు రెట్లు పెంచి రూ.1,000 చేశారు ఆనాటి సీఎం చంద్రబాబు. 2019 ఎన్నికలకు ముందు రూ.2 వేలు చేశారు. అయితే.. ఆ ఎన్నికల్లో ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్ పింఛన్ రూ.3 వేలు చేస్తానని హామీ ఇచ్చారు. అధికారం చేపట్టాక మాట మార్చారు. పెంచుతూ పోతాను అంటూ రూ.వెయ్యి పెంచడానికి ఐదేళ్లు తీసుకున్నాడు. నవరత్నాలు పేరిట సంక్షేమ పాలన అంటూ అభివృద్ధికి పాతర వేశారు. ఈ ఏడాది ప్రారంభంలో గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు అన్నింటికి నిధులు పూర్తిగా ఇచ్చారా అంటే అదీలేదు. ఆరోగ్యశ్రీ, పేద విద్యార్థులకు ఇచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్.. ఇలా అన్ని సంక్షేమ పథకాలకు రూ.వేల కోట్లు బకాయిలు పెట్టి వెళ్లారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక బకాయిలు చెల్లిస్తూ వస్తున్నది. ఏదిఏమైనా 2024 ఎన్నికల సంవత్సరం కావడంతో ఏడాది ప్రారంభం ఆరు నెలలు వైసీపీ ప్రభుత్వం.. చివరి ఆరు నెలలు టీడీపీ కూటమి ప్రభుత్వం సంక్షేమానికే పెద్దపీట వేశాయని చెప్పాలి. రెండు ప్రభుత్వాలు చెరో ఆరు నెలలు పాలించిన సంవత్సరం కూడా 2024 కావడం కొసమెరుపు.

పేదల ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటిన్లు

రాష్ట్ర విభజన తరువాత పేదలు, వివిధ ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రులకు వచ్చే అభాగ్యులకు రూ.5లకే కడుపు నిండా అన్నం వడ్డించి ఆకలి తీర్చాలనే లక్ష్యంగా ఆనాటి సీఎం చంద్రబాబు 'అన్న క్యాంటిన్లు' ఏర్పాటు చేశారు. రోజులు వేలాది మంది పేదల ఆకలి తీర్చారు. 2019 మేలో కొలుదీరిన జగన్ సారథ్యంలో వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటిన్లు మూసేసింది. మళ్లీ చంద్రబాబు సారథ్యంలోని టీడీపీ కూటమి ప్రభుత్వం రావడం.. అన్న క్యాంటిన్లు ఏర్పాటయ్యాయి. అభాగ్యులకు అన్నం పెట్టి ఆకలి తీర్చే అన్న క్యాంటిన్ల పునఃప్రారంభానికి 2024 సంవత్సరం వేదిక కావడం.. రాబోయే రోజుల్లో అన్న క్యాంటిన్లు గుర్తు చేసుకున్న ప్రతిసారి 2024ను స్మరించుకోక తప్పదు. కర్నూలు నగరంలో కలెక్టరేట్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల, పాతబస్టాండ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఉల్చాల రోడ్డులో అన్న క్యాంటిన్లు ఏర్పాటు చేశారు. ఒక్కో క్యాంటిన్‌లో రోజూ ఉదయం, మధ్యాహ్నం, రాత్రి మూడు పూటల సుమారు 600-750 మందికిపైగా ఒక పూటకు రూ.5లకే టిఫిన్, అన్నం వడ్డించి ఆకలి తీరుస్తున్నారు. ఎమ్మిగనూరు పట్టణంలో సోమప్ప సర్కిల్, శ్రీనివాస్ సర్కిల్, ఆదోని పట్టణంలో స్త్రీలు, చిన్న పిల్లల ఆస్పత్రి, పాత బస్టాండ్ సర్కిల్, పోస్ట్ ఆఫీస్ (రైల్వే ఫ్లై ఓవర్ బిడ్జి దిగువన) అన్న క్యాంటిన్లు ఏర్పాటు చేశారు. రోజుకు ఒక్కో అన్న క్యాంటిన్‌లో దాదాపు 500-600 మందికి పైగా ఆకలి తీరుతోంది.



టిడ్కో ఇళ్లు ఎప్పుడిస్తారు?



తాగునీటి కోసం అవస్థలు

నగరానికి దూరంగా టిడ్కో ఇళ్లు కట్టించారు. 2,065 మంది లబ్ధిదారులకు ఇళ్లు అప్పగిస్తే 65 కుటుంబాలు కూడా నివాసం లేవు. రాత్రి కరెంట్ సక్రమంగా ఉండడం లేదు. పాముల బెడద తీవ్రంగా ఉంది. తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రెండు మూడు రోజులకు ఒకసారి ట్యాంకుతో నీళ్లు పోసి వెళ్తున్నారు. ఆ నీరు కూడా శుభ్రంగా లేవు. ఖాళీ చేసే వెళ్దామని అనుకుంటున్నాం.

- బి.శేఖర్, టిడ్కో కాలనీ, కర్నూలు

(5వ పేజీ తరువాయి)

నగరం, పట్టణాలకు దూరంగా టిడ్కో ఇళ్లు నిర్మించారు. తాగునీరు, రహదారులు, పట్టణాల్లో పనులకు వెళ్లాలంటే రవాణా, పిల్లలకు పాఠశాలలు, ఆస్పత్రులు వంటి కనీస వసతులు మృగ్యమయ్యాయి. దీంతో ఇళ్లు ఇచ్చినా నివసించేందుకు పేదలు భయందోళన వ్యక్తం చేస్తున్నారు. కర్నూలు నగరానికి దాదాపు 8-10 కి.మీల దూరంలో కర్నూలు-నంద్యాల జాతీయ రహదారి బైపాస్ రోడ్డు పక్కనే జగన్నాథగట్టుపై 10 వేల ఇళ్లు నిర్మాణం చేపడితే.. 8,829 ఇళ్లు పూర్తి చేశామని, 2,064 మంది లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించామని ఇంజనీర్లు తెలిపారు. అయితే.. కనీస వసతులు లేకపోవడంతో 65 కుటుంబాలు కూడా నివసించడం లేదు. వారు కూడా ఖాళీ చేసి వెళ్లిపోయేందుకు సిద్ధం అవుతున్నారు. ఎమ్మిగనూరు పట్టణం శివన్న నగరంలో 1,920 ఇళ్లు లబ్ధిదారులకు అప్పగిస్తే 25 కుటుంబాలకు మించి నివసించడం లేదు. ఆదోనిలో 1,632 ఇళ్లు అప్పగిస్తే వాటిలో ఒక్క కుటుంబం కూడా ఉండటం లేదు. నంద్యాలలో 2,096, ఆళ్లగడ్డలో 1,392 ఇళ్లు లబ్ధిదారులకు అప్పగిస్తే కనీస వసతులు లేక ఆ ఇళ్లలో ఉండేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు. తాగునీటి పైపులైన్లు, ఓహెచ్‌ఆర్ ట్యాంకుల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. మౌలిక వసతులకు కర్నూలు జిల్లాలో రూ.33.73 కోట్లు, నంద్యాల జిల్లాలో 16.10 కోట్లు అవసరమని అధికారులు పేర్కొంటున్నారు.

కరెంట్ లేదు.. తాగునీరు రావడం లేదు

టిడ్కో కాలనీలో నా భార్య పేరిట ఇల్లు మంజూరు అయ్యింది. రెండో అంతస్తులో ఇల్లు ఇచ్చారు. మగ్గం నేస్తేనే మాకు పూట గడిచేది. మగ్గం షెడ్డు నిర్మించి ఇవ్వలేదు. కరెంట్ లేదు. తాగునీరు రావడం లేదు. తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

- గణపతి రవి, టిడ్కో కాలనీ, ఎమ్మిగనూరు

ఆరు నెలలైనా..

కూటమి ప్రభుత్వం జూన్ 12న కొలువుదీరింది. టిడ్కో ఇళ్ల తాజా పురోగతిపై అదే నెలలో సర్వే చేయడంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి. అయితే.. ఐదు నెలలు గడిచినా పంపిణీ చేయకపోగా మౌలిక వసతులపై దృష్టి సారించలేదు. కనీసం ముళ్ల పొదలు కూడా తొలగించలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కనీస సౌకర్యాలు కల్పించి ఇళ్లు పంపిణీ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

వసతులు ఏర్పాటు చేయాలి



అన్ని ఏర్పాట్లు చేశామంటూ గతేడాది వైసీపీ ప్రభుత్వం మాకు ఇంటిని అప్పగించింది. అంతా బాగుందన్న భావనతో ఇక్కడకు వచ్చి నివాసం ఉంటున్నాం. తీరా చూస్తే సదుపాయాలు సరిగా లేవు. తాగునీటికి కూడా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. నీటికోసం రోజూ వంద రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. పేదలమైన తాము తాగేందుకు నెలకు రూ.3 వేలు ఖర్చు చేస్తే మిగిలేన వాటిని కొనేదెలా? ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం పూనుకుని అన్ని వసతులు ఏర్పాటు చేయాలి.

- ప్రసాద్, టిడ్కో లబ్ధిదారుడు, ఎస్సార్బీసీ కాలనీ, నంద్యాల.

రాకపోకలకు ఇబ్బందే



ఇక్కడ వసతులు ఏమీ లేవు. అన్నింటికి టౌనులోనికి పోవాల్సిన పరిస్థితి. ఆటో వాళ్లు ఇక్కడికి రావాలంటే రూ.100కు పైనే అడుగుతున్నారు. ఇక సాయంత్రం ఆరు దాటిందంటే రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఇక్కడ నివాసం ఉండెదెలా? అద్దె భారం తగ్గుతుందని, సొంత ఇల్లు అని ఉండాల్సి వచ్చినా, సరైన సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నాం. కూటమి ప్రభుత్వం కాలనీలో నివాసముంటున్న వారికి ఇబ్బంది లేకుండా సదుపాయాలు కల్పించాలి.

- షేక్షావలి, టిడ్కో లబ్ధిదారుడు, ఎస్సార్బీసీ కాలనీ, నంద్యాల

బస్సు లేదు.. నీళ్లు రావు


నగరంలో అద్దె కట్టలేక రెండేళ్ల క్రితం ఇక్కడికి వచ్చాం. బస్సు సౌకర్యం లేదు. పనులకు, పిల్లలను బడికి పంపడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రాత్రివేళ రావాలంటే ఎన్నో అవస్థలు. పిల్లలను బడికి పంపాలంటే నెలకు ఆటో బాడుగ రూ.1,500 వరకు చెల్లించాల్సి వస్తున్నది. ఇక్కడికి వచ్చి వృద్ధులకు పింఛన్లు ఇవ్వడం లేదు. రేషన్ వాహనం రావడం లేదు. రాత్రిళ్లలో గుర్తు తెలియని వ్యక్తులు తిరుగుతున్నారు. పెట్రోలింగ్ పెట్టాలని కోరినా పట్టించుకోవడం లేదు.

- ఈశ్వర్, టిడ్కో కాలనీ, కర్నూలు

ఉమ్మడి జిల్లాలో టీడీపీ ఇళ్ల పురోగతి వివరాలు

నగరం/పట్టణం	అగ్రిమెంట్ అయిన ఇళ్లు	పనులు మొదలు పెట్టిన ఇళ్లు	పూర్తైన ఇళ్లు	లబ్ధిదారులకు అప్పగించిన ఇళ్లు
● కర్నూలు జిల్లా:				
కర్నూలు నగరం	10,000	10,000	8,829	2,064
ఆదోని	4,704	4,720	3,494	1,632
ఎమ్మిగనూరు	4,272	4,272	4,272	1,920
మొత్తం	18,976	18,992	16,595	5,616
● నంద్యాల జిల్లా:				
నంద్యాల పట్టణం	10,000	9,000	5,370	2,096
డోన్	306	288	288	–
ఆళ్లగడ్డ	2,304	1,392	1,392	1,392
మొత్తం	12,610	11,680	7,050	3,488

కానుగ ఆకుపై కరుణామయుడు



ప్యాపిలి మండలంలోని వెంగళాంపల్లి గ్రామానికి చెందిన చిత్రకారుడు మధుక్రిష్ణ కానుగ ఆకుపై యేసుప్రభు చిత్రం వేశారు. బుధవారం క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని ఆయన ఈ చిత్రం గీశారు. చిత్రం ఆకర్షణీయంగా ఉండటంతో గ్రామస్తులు మధుక్రిష్ణను అభినందించారు.

- ప్యాపిలి(ఆంధ్రజ్యోతి).

హక్కులపై అవగాహన తప్పనిసరి

జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్

నంద్యాల కల్చరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి వినియోగదారుడు తమకు ఉన్న హక్కులపై అవగాహన కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పౌరసరఫరాల ఇన్‌చార్జి అధికారి రాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి జేసీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల సంక్షేమం, వారి హక్కులపై అవగాహన కల్పించేందుకు ప్రతిఏటా ఇలాంటి కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. వినియోగదారులు డిజిటల్ లావాదేవీలు చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. కొనుగోలు చేసిన వస్తు సేవల విషయంలో మోసపోతే అందుబాటులో ఉన్న పరిష్కార వేదికలను ఆశ్రయించాలన్నారు. ఈ క్యాక్రమంలో సివిల్ సప్లైస్ అధికారులు, జిల్లా వినియోగదారుల అధ్యక్షుడు అమీర్‌బాష, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్

27న కొబ్బరి సాగుపై అవగాహన సదస్సు

నంద్యాల రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని నూనెపల్లెలో వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో ఈనెల 27న కొబ్బరి సాగుపై జిల్లాస్థాయి అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అవగాహన సదస్సులో ఉద్యానశాఖ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు, కోకోనట్ బోర్డు డైరెక్టర్లు హాజరవుతారని చెప్పారు. కొబ్బరి సాగులో మెళకువలను, నూతన సాంకేతిక పద్ధతులను శాస్త్రవేత్తలు రైతులకు వివరిస్తారన్నారు. కొబ్బరి బోర్డు రైతులకు అందజేస్తున్న పథకాలను, రాయితీ గురించి బోర్డు డైరెక్టర్లు తెలియజేస్తారని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మట్కా బీటర్ల అరెస్టు

- 1.02 లక్షల నగదు స్వాధీనం

నంద్యాల క్రైం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు జిల్లాలో అసాంఘిక కార్యకలాపాల నియంత్రణలో భాగంగా త్రీ టౌన్ సీఐ సూర్యమౌళి, ఎస్ఐ సత్యనారాయణ తమ సిబ్బందితో ఇద్దరు మట్కా బీటర్లను అరెస్టు చేశారు. పోలీస్ అధికారులు మంగళవారం చేపట్టిన విస్తృత తనిఖీల్లో భాగంగా నంద్యాల పట్టణం నూనెపల్లె జిలేబి సెంటర్ వద్ద ఇద్దరు వ్యక్తులు మట్కా ఆడేందుకు ప్రజలను ప్రేరేపించి వారి వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తుండగా అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి మట్కాకు సంబంధించిన చీటీలతో పాటు రూ.1,02,070నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. పట్టణంలోని కొలిమిపేటకు చెందిన షేక్ జమాల్‌బాషా, మహానంది మండలం బుక్కాపురం గ్రామానికి చెందిన బొగ్గు నాగేంద్రుడును అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

28న స్థాయి సంఘాల సమావేశాలు

కర్నూలు, న్యూసిటీ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు ఈ నెల 28న నిర్వహించనున్నట్లు సీఈఓ జి.నాసరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్‌లోని సీసీఓ చాంబర్‌లో ఏడు స్థాయిసంఘ సమావేశాలు నిర్వహిం చేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేసారని తెలిపారు. ఉదయం 10.30 గంటల నుండి 11.30 గంటల వరకు 2వ స్థాయి సంఘం, 11.30 నుండి 12.00 గంటల వరకు 3వ స్థాయి సంఘం, 12.30 గంటల నుండి 1.30 గంటల వరకు 6వ స్థాయి సంఘం, మధ్యాహ్నం 1.30 నుంచి 2.30 గంటల వరకు 4వస్థాయి సంఘం, 3.00 గంటల నుంచి 4.00 వరకు 5వ స్థాయి సంఘం, 4.00 నుంచి 6.00 వరకు 1, 7వ స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్లు సీఈఓ పేర్కొన్నారు.

కౌన్సిల్‌లో రసాభాస

- అభివృద్ధి నిధుల మంజూరుపై టీడీపీ, వైసీపీ సభ్యుల వాగ్వాదం
- టీడీపీ సభ్యులకు అడ్డుపడిన మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్
- ప్రజా సమస్యలను గాలికి వదిలిన కౌన్సిల్ సభ్యులు



మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌ను కూర్చోవాలని చెబుతున్న చైర్మన్ డాక్టర్ రఘు



మాట్లాడుతున్న టీడీపీ కౌన్సిలర్లు

ఎమ్మిగనూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణాభివృద్ధికి తమ ఎమ్మెల్యే హయాంలో నిధులు మంజూరయ్యాయని టీడీపీ కౌన్సిలర్ అంటే.. లేదు తమ ఎమ్మెల్యే హయాంలో కూడా మంజూరయ్యాయని వైసీపీకి చెందిన వారు తలపడ్డారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్మన్ డాక్టర్ రఘు అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభంలో ఒకట్రెండు అంశాలు చదువుతుండగానే మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్‌లేచి అజెండాలో ప్రవేశపెట్టిన అంశాలను టేబుల్ అజెండాను ఆమోదిస్తున్నామని చెప్పారు. అటు తర్వాత వైస్ చైర్మన్ మాట్లాడుతూ క్రిస్మస్, నూతన సంవత్సరం, పట్టణ జాతర శుభాకాంక్షలను కౌన్సిల్ సభ్యులకు అధికారులకు పట్టణ ప్రజలకు తెలిపారు. అలాగే మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి హయాంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేయించి పట్టణంలో శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు.

అనంతరం టీడీపీ ఫ్లోర్ లీడర్ దయాసాగర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి, సీఎం చంద్రబాబు నాయుడు తరపున కౌన్సిల్ సభ్యులకు, అధికారులకు, ప్రజలకు నూతన సంవత్సర, క్రిస్మస్, జాతర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కొన్ని నిధులు మంజూరైన మాట వాస్తవమేనని, అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పట్టణంలో రూ.40లక్షలతో సెంట్రల్ లైటింగ్, నిలిచి పోయిన ఏఐఐబీ నిధులను రూ.146 కోట్ల తిరిగి మంజూరు చేయించారని చెబుతుండగా వైస్ చైర్మన్ అడ్డు తగులుతూ ఏ నిధులు ఎప్పుడు మంజూరు చేశారని, ఏ శాఖ నుంచి నిధులు వచ్చాయని, తాము అభివృద్ధి చేస్తే మీరు చెప్పుకోవడం ఏమిటని అడ్డుతగిలారు. దీనికి దయాసాగర్‌తో పాటు టీడీపీ కౌన్సిలర్లు స్పందించారు. ఈ సందర్భంగా టీడీపీ, వైసీపీ సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం, అరుపులు, కేకలతో కొద్దిసేపు కౌన్సిల్ సమావేశం రసాభాసగా మారింది. ఎవరు ఏం మాట్లాడుతున్నారో గందరగోళ పరిస్థితి నెలకొంది. దీంతో చైర్మన్ డాక్టర్ రఘు కల్పించుకున్నా పరిస్థితి సర్దుమణగలేదు. దీంతో చైర్మన్ డాక్టర్ రఘు సమావేశాన్ని ముగించి పోడియం దిగి వెళ్లిపోయారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ దివ్యకళ, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, కౌన్సిలర్లు నాగేశప్ప, కాశింబేగ్, బజారి, కేశవరెడ్డి, రాజారత్నం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగు నెలలుగా ఇంతే!

గడచిన నాలుగు నెలలుగా కౌన్సిల్ సమావేశంలో ఇరు పార్టీల కౌన్సిలర్లు ఏదో ఒక అంశంపై అనవసరంగా వాగ్వాదం చేసుకోవడం..పావుగంట..అరగంటలోపు సమావేశాన్ని ముగించడం తంతుగా మారింది. సమస్యలను చర్చించకుండా రభస సృష్టిస్తున్న కౌన్సిల్ సభ్యులపై పట్టణ ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు.

చెరువులు, వాగులను రక్షించండి

- మత్స్యకారుల జీవనోపాధిని కాపాడండి
- మత్స్యకారుల సంఘం నగర అధ్యక్షుడి విజ్ఞప్తి



జలమండలి వద్ద ధర్నా చేస్తున్న మత్స్యకారులు

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో చెరువులను కాపాడాలని మత్స్య శాఖ సంఘం నగర అధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం వివిధ ప్రజా సంఘాలు జలమండలి కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. చెరువులను కబ్జా చేసి మత్స్యకారులను, రైతులను ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తున్న భూస్వాములు, రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ దారుల అక్రమాలను అరికట్టాలని అన్నారు. చెరువుల కబ్జాల వల్ల మత్స్యకారులు జీవనోపాధి కోల్పోతున్నారని ఆరోపించారు. కులవివక్ష వ్యతిరేక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు క్రిష్ణ మాట్లాడుతూ 40 ఏళ్లుగా దళితుల అనుభవంలో ఉన్న చెరువు భూమిని బిల్డర్లు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. పట్టణ పౌర సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, నాగరాజు, వివిధ కాలనీల అసోసియేషన్ల ప్రతినిధులు శ్రీనివాసరెడ్డి, వన్నూరు సాహెబ్ మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నాటి చెరువులను, వాగులను, నదుల పరిసరాలను బిల్డర్లు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేసి వ్యాపారం చేస్తుంటే పాలకులు ప్రభుత్వ అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. పంట పొలాలకు, తాగునీరుకు, బోరింగులకు ఆధారంగా ఉన్న చెరువులను కాపాడాలని కోరారు. గార్గేయపురం చెరువు సమీపంలో ఇరిగేషన్ అధికారులు వేసిన సిమెంటు రోడ్డు కబ్జాకు గురైందని, వెంటనే ఆ స్థలాన్ని కాపాడాలని నీటి పారుదల శాఖ డీఈ సుష్మకు వినతి పత్రం అందించారు. ఈ ధర్నాలో బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు యాకోబు, నాగేంద్ర, గురుస్వామి, యూనుస్, పీటర్, గౌడ్, రెహమాన్, రుస్తుం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

డోన్ రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన రమీజ్ (30) సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం జరిగింది. డోన్ పట్టణం గుత్తిరోడ్డులో రహదారి మరమ్మతుల్లో భాగంగా రోడ్డు పక్కన గుంతలు తీశారు.



నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకుడు ధర్మవరం గౌతమ్ రెడ్డి

కొత్తపల్లి గ్రామానికి చెందిన రమీజ్ తన స్నేహితులతో బైక్‌పై సోమవారం రాత్రి వెళ్తూ గుంతను గమనించక ప్రమాదవశాత్తు గుంతలో పడి మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న డోన్ టీడీపీ యువ నాయకులు ధర్మవరం గౌతమ్ రెడ్డి మృతుని స్వగృహానికి వెళ్లి ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతుని భౌతిక కాయానికి నివాళులర్పించారు. వైసీపీ నాయకులు డోన్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో మృతదేహాన్ని చూసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. డోన్ ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు తదితరులు ఇందులో ఉన్నారు.

విద్యుదాఘాతంతో గొర్రెల కాపరి..



రామాంజనేయులు (ఫైల్)

తుగ్గలి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జి.ఎర్రగుడికి చెందిన గొర్రెల కాపరి బసప్పగారి రామాంజనేయులు (22) విద్యుత్ తీగలు తగిలి మృతి చెందాడు. వివరాలివి.. మండలంలోని జి.ఎర్రగుడి, జొన్నగిరి తండా గ్రామాల మధ్య ఓ రైతు పొలంలో మిషన్‌తో కంది పంట కోతను చేపడుతున్నారు. అక్కడే గొర్రెలు మేపుతున్న రామాంజనేయులు మిషన్‌పైకి ఎక్కాడు. హైటెన్షన్ వైర్లు తాకడంతో యువకుడి కింద పడ్డాడు. రైతులు చికిత్స నిమిత్తం గుత్తి వైద్యశాలకు తరలించగా.. అప్పటికే రామాంజనేయులు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. జొన్నగిరి ఎస్ఐ విజయశేఖర్ ఘటనా స్థలాన్ని పరిశీలించడంతో పాటు వైద్యశాలకు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఆయన చెప్పారు. రామాంజనేయులుకు భార్య శిరీష, ఏడాది కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

ఎమ్మిగనూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీవర్స్ కాలనీ వాసి రాఘవేంద్ర(44) నిప్పటించుకొని ఆత్మహత్య యత్నం చేసి చికిత్స పొందుతూ మృతి చెందాడు. రాఘవేంద్ర చిన్న కిరాణ దుకాణాన్ని నిర్వహించేవాడు. దుకాణంలో నష్టాలు రావటంతో అప్పులు పెరిగాయి. దీంతో తన తండ్రికి వచ్చే పెన్షన్‌తో జీవించేవాడు. రెండు వారాల క్రితం తండ్రి మృతి చెందాడు. ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో మానసిక వేదనకు లోనై సోమవారం వేకువజామున ఇంట్లో ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య యత్నం చేశాడు. కుటుంబసభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతి చెందాడు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థినిపై లెక్చరర్ లైంగిక వేధింపులు

- ఒక ప్రైవేటు కళాశాలలో ఉదంతం
- ఆలస్యంగా వెలుగులోకి
- నిందితుడిపై పోక్సో కేసు నమోదు



రోడ్డుపై బైఠాయించిన ఏఐఎస్ఎఫ్ నాయకులు

కోడుమూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): కోడుమూరులోని ఒక ప్రైవేటు కళాశాలలోని ఇంటర్ విద్యార్థినిపై కంప్యూటర్ లెక్చరర్ లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని సోమవారం మధ్యాహ్నం క్లాస్ రూంలో ఒంటరిగా ఉన్న సమయంలో కంప్యూటర్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న కర్నూలుకు చెందిన భాస్కర్ అసభ్యకరంగా ప్రవర్తించినట్లు తెలిసింది. లెక్చరర్ నుంచి విద్యార్థిని తప్పించుకొని పక్కనే ఉన్న మరో క్లాసు రూంలోకి వెళ్లిపోయింది. మంగళవారం తోటి విద్యార్థులకు చెప్పడంతో వెలుగులోకి వచ్చింది. విషయం తెలుసుకొన్న ఏఐఎస్ఎఫ్ నాయకుడు రంగస్వామి ఆధ్వర్యంలో కళాశాల వద్ద ధర్నా, రాస్తారోకో చేపట్టారు. విద్యార్థిని ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఏపీ శ్రీనివాసులు కేసు నమోదు చేశారు. పోలీసులు సీసీ పుటేజీలను పరిశీలించారు. విద్యార్థిని ఉన్న క్లాసు రూంలోకి భాస్కర్ వెళ్లడం, కొన్ని సెకండ్లలో విద్యార్థిని బయటికి రావడం రికార్డు అయింది. ఆధారాలు దొరకడంతో నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ముద్దాయిలు సత్ప్రవర్తనతో మెలగాలి

- ఆదోని సబ్ జైలును తనిఖీ చేసిన జిల్లా న్యాయాధికారి



కోర్టు భవనాలను పరిశీలిస్తున్న న్యాయాధికారి

ఆదోని రూరల్ డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ముద్దాయిలు సత్ప్రవర్తనతో మెలగాలని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కపర్ది తెలి పారు. మంగళవారం న్యాయాధికా రులు, న్యాయవాదులతో కలిసి ఆదోని సబ్‌జైలును తనిఖీ చేశారు. జైలులో ఇస్తున్న ఆహారంపై ఆరా తీశారు. 41 మంది ముద్దాయిలు ఉన్నారని జైలు సూపరింటెండెంట్ నజీర్ అహ్మద్ తెలిపారు. న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని వారికి కోర్టు తరపున ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కోర్టు నూతన భవనాలను భవనాలను జిల్లా జడ్జి కపర్ది బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుందర్ సింగ్, వైస్ ప్రెసిడెంట్ మొలగవల్లి జనార్దన్ న్యాయవాదులతో కలిసి పరిశీలించారు.

ఈతకు వెళ్లి ఇంజనీరింగ్ విద్యార్థి మృతి



పెద్దాసుపత్రి మార్చురీ వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు

కర్నూలు క్రైం, హాస్పిటల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉలిందకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని కేవీ సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థి రాంప్రసాద్ రెడ్డి (19) ఈతకు వెళ్లి మృతి చెందాడు. బేతంచెర్ల మండలం ముద్దవరం గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి దంపతులకు నలుగురు కూతుళ్లు, కొడుకు సంతానం. రాంప్రసాద్ రెడ్డి చివరివాడు. కేవీ సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం మధ్యాహ్నం మిత్రులు పది మందితో కలిసి కాలేజీ వెనుక ఉన్న బావి వద్దకు ఈతకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు బావిలో మునిగి మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి మార్చురీకి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగిం చారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఉలిందకొండ ఎస్ఐ ధనుంజయ తెలిపారు.

మార్చురీ ఎదుట యువజన, విద్యార్థి సంఘాల ఆందోళన

రాంప్రసాద్ రెడ్డి మృతిపట్ల విద్యార్థి, యువజన సంఘాలు భగ్గుమన్నాయి. కర్నూలు ప్రభుత్వ వైద్యశాల మార్చురీ వద్ద విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులతో కలిసి ఆందోళన చేపట్టాయి. డీవైఎఫ్ఐ కార్యదర్శి నగేష్, ఎస్ఎఫ్ఐ కార్యదర్శి అబ్దుల్లా, ఐసా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ హాస్టల్‌లో సెక్యూరిటీ అధ్వా నంగా ఉందని ఆరోపించారు. విద్యార్థి మృతి చెందిన విషయాన్ని యాజమాన్యం వెంటనే తల్లిదండ్రులకు ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు.

బీసీల సంక్షేమానికి చంద్రబాబు చొరవ

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై. నాగేశ్వరరావు



మాట్లాడుతున్న వై. నాగేశ్వరరావు

కర్నూలు అర్బన్, డిసెంబర్ 24(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో బీసీల సంక్షేమంపై ఇచ్చిన హామీలు, పథకాల అమలుకు సీఎం చంద్రబాబు చొరవ చూపుతున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో బీసీ సెల్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. బీసీల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ మాత్రమే ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీ సంక్షేమ హాస్టళ్లకు సంబంధించి గత ప్రభుత్వం పెట్టిన రూ.110 కోట్ల బకాయిల్లో ఇప్పటికే రూ.76.38 కోట్లు కూటమి ప్రభుత్వం చెల్లించిందన్నారు. ప్రభుత్వం చెల్లించగా పెండింగ్ ఉన్న రూ.34.14 కోట్లను త్వరలో చెల్లించాలని ఆదేశించారని గుర్తు చేశారు. 2024-25 విద్యాసంవత్సరానికి బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.135 కోట్లు కేటాయించిందన్నారు. స్కిల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా స్పోకెన్ ఇంగ్లీష్, సోషల్ ఎమోషనల్, నైతిక విలువలు, నీతి శాస్త్రం, డిజిటల్ లీటరసిపై బీసీ విద్యార్థులకు శిక్షణకు ప్రభుత్వం సిద్ధమైందన్నారు. 26 జిల్లాల్లో 104 బీసీ హాస్టళ్లలో పైలట్ ప్రాజెక్టులుగా అమలు చేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సత్రం రామకృష్ణ, బీసీ నాయకులు మాల కార్పొరేషన్ డైరెక్టర్ పోతురాజు రవికుమార్, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ధరూర్ జేమ్స్, రాష్ట్ర సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చింతమాను సురేంద్రనాయుడు, జిల్లా బీసీ యూత్ అధ్యక్షుడు కిరణ్, దేవేంద్రగౌడ్, వీరేష్, డీవీ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో బాదుడే.. బాదుడు

- ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి
- 27న విద్యుత్ అధికారులకు వినతి
- మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచమని వాగ్దానం చేసిన కూటమి అధికారం లోకి రాగానే ప్రజలపై బాదుడే..బాదుడు మొదలు పెట్టారని పాణ్యం మాజీ ఎమ్మెల్యే, నంద్యాల జిల్లా వైసీపీ అధ్యక్షుడు కాట సాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం తన స్వగృహంలో అధిష్ఠానం ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించి ఈనెల 27న జిల్లా, నియోజకవర్గంలో ఇన్‌చార్జ్‌లు విద్యుత్ చార్జీలు పెంపును నిరసిస్తూ కరెంట్ ఆఫీసుకు ర్యాలీగా వెళ్లి అధికారులకు వినతిపత్రాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఓట్లు వేయించుకుని ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట అని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారం చేపట్టిన ఆరు నెలల్లో రెండు సార్లు ట్రూఅప్, విద్యుత్ చార్జీల పేరిట వేల కోట్ల భారాన్ని వేశారని ఆరోపించారు. పాణ్యం నియోజకవర్గం పరిధిలో ఈనెల 27న కర్నూలు విద్యుత్ కార్యాలయానికి ర్యాలీగా చేరుకుని ఎస్ఈకి వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రజలు పెద్దఎత్తున హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సరిహద్దులను గుర్తించండి: జేసీ

ఓర్వకల్లు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణపల్లె, కాల్వ సరిహద్దులోని ఫారెస్టు భూములను త్వరితగతిన గుర్తించాలని జేసీ డా.బి. నవ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని సోలార్ పార్కు సమీపాన ఉన్న బ్రాహ్మణపల్లె, కాల్వ సరిహద్దులోని ఫారెస్టు భూములను జేసీతో పాటు ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, ఆర్డీవో సందీప్ కుమార్, తహసీల్దార్ విద్యాసాగర్, డీఎఫ్‌వో శ్యామల, సర్వేయర్ శంకర్ మాణిక్యం, ఫారెస్టు అధికా రులు, సర్వేయర్లు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. కొంత కాలంగా సోలార్ పార్కు భూముల విషయంలో నడుస్తున్న వివాదంపై డిప్యూటీ సీఎం నిగ్గు తేల్చాలని ఆదేశించారు. దీంతో అధికారులు సోలార్ పార్కు అధికారులు ఆ పరిసర ప్రాంతాలను పరిశీలించారు.



అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవ్య

క్రిస్మస్ కాంతులు

- ముస్తాబైన చర్చిలు
- ప్రార్థనలకు ప్రత్యేక ఏర్పాట్లు


గోస్పాడు: పసురుపాడులోని చర్చి


పాణ్యం: ఆలమూరులోని సీఎస్ఐ చర్చి


మిడుతూరులోని సీఎస్ఐ చర్చి


నంద్యాలలోని హోలీక్రాస్ కెథడ్రల్ చర్చిలో ప్రార్థనకు సిద్ధం చేసిన ప్రాంగణం

నంద్యాల కల్చరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ సందర్భంగా పట్టణంలోని చర్చిలను అలంకరించారు. డయాసిస్ హోలీక్రాస్ కెథడ్రల్ చర్చి (పెద్ద చర్చి), పరిశుద్ధ ముత్తయి చర్చి, సాయిబాబానగర్ చర్చి, డేనియల్‌పురం చర్చి, సుధాకర్ చర్చి, గోపాల్ నగర్ చర్చి, వీసీ కాలనీ చర్చి, ఎస్పార్పీసీ కాలనీలోని చర్చి, సెయింట్ ఆల్ఫన్సస్ చర్చి తదితర చర్చిలను ముస్తాబు చేశారు.

గోస్పాడు(ఆంధ్రజ్యోతి): మండలంలో చర్చిలను విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు. చర్చిల నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

ఆత్మకూరు(ఆంధ్రజ్యోతి): శ్రీశైల నియోజకవర్గంలో బుధవారం క్రిస్మస్ సందర్భంగా అన్ని చర్చీలను ప్రత్యేక అలంకరణతో తీర్చిదిద్దారు. మంగళవారం అర్ధరాత్రి నుంచే అన్ని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేలా అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశారు. ప్రత్యేకించి ఆత్మకూరు పట్టణంలోని ఏబీఎం పాలెం, ఎస్సీజీ పాలెం, ఇందిరానగర్, లక్ష్మీనగర్ తదితర కాలనీల్లోని చర్చీలన్నింటికీ విద్యుత్ అలంకరణ చేశారు. అలాగే కరివేన రస్తాలో ఉన్న ఆర్‌సీఎం చర్చిని కూడా అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. పట్టణంలోని గౌడ్‌సెంటర్, కప్పలకుంట, కేజీ రోడ్డు తదితర ప్రాంతాలు జనంతో కిక్కిరిసిపోయాయి.

వెలుగోడు(ఆంధ్రజ్యోతి): మండలంలో క్రిస్మస్ సందర్భంగా చర్చిలను విద్యుద్దీపాలతో అలంకరించారు. బుధవారం క్రైస్తవుల ప్రార్థన నిమిత్త ప్రార్థన మందిరాల్లో ఏర్పాట్లు చేశారు.

మిడుతూరు(ఆంధ్రజ్యోతి): కడుమూరు, మాసపేట, తలముడిపి, అలగనూరు, మిడుతూరు, 49 బన్నూరు గ్రామాలతో పాటు వివిధ గ్రామాల్లో క్రిస్మస్ సందర్భంగా చర్చిలకు విద్యుత్ దీపాలతో అలంకరణలు చేశారు. ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

పాణ్యం(ఆంధ్రజ్యోతి): మండలంలోని చర్చిలు రంగుల వెలుగుల్లో నిండిపోయాయి, ఆలమూరు సీఎస్ఐ చర్చిని ఆలయ సంఘపెద్దల ఆధ్వర్యంలో రంగుల దీపాలతో ముస్తాబు చేశారు, పాణ్యం షాలేము ప్రార్థనా మందిరం, బలపనూరు, కౌలూరు, నెరవాడ, గోనవరం తదితర గ్రామాలలోని చర్చిలు క్రిస్మస్ సందర్భంగా ముస్తాబయ్యాయి.

ఘనంగా సెమీ క్రిస్మస్

గడివేముల(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంచాలకట్ట గ్రామంలో దివ్య బాలయేసు చర్చిలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బిషప్ మహాగణ గోరంట్లజ్వానేష్ మాట్లాడుతూ యేసు సూచనలను ప్రతి ఒక్కరు పాటించాలని సూచించారు. . అనంతరం మహిళలకు, వృద్ధులకు దుస్తులను పంపిణీ చేశారు. ఫాదర్ తోట జోసఫ్, ఫాదర్ లహస్త్రయ్, ఫాదర్ జోజిరెడ్డి పాల్గొన్నారు.

కొత్తపల్లి(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి రాజరాజేశ్వరి హై స్కూల్‌లో సెమీ క్రిస్మస్‌ను హెచ్ఎం వాసుదేవరెడ్డి, కరస్పాండెంట్ పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల చేసిన క్రీస్తు జననంపై ప్రత్యేక నాటక ప్రదర్శన, వేషధారణ ఆకట్టుకుంది.


వెలుగోడులోని సీఎస్ఐ చర్చి

సీఎం చంద్రబాబును కలిసిన మాజీ మంత్రి ఏరాసు


సీఎం చంద్రబాబును కలసిన మాజీ మంత్రి ఏరాసు

ఆత్మకూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): అమరావతిలోని సచివాలయంలో బుధవారం సీఎం చంద్రబాబును మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు జిల్లా రాజకీయాలపై కాసేపు చర్చించినట్లు ఏరాసు చెప్పారు.

క్రైస్తవులకు ఎమ్మెల్యే క్రిస్మస్ శుభాకాంక్షలు

నందికొట్కూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): క్రైస్తవులకు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలను ఎమ్మెల్యే గిత్తా జయసూర్య తెలిపారు. క్రిస్మస్ అంటే ఏసు క్రీస్తును స్మరించుకునే సంతోషకరమైన సమయం అని, సాటి మనుషుల పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, శత్రువల పట్ల క్షమ, ఆకాశంతటి సహనం, అవధులు లేని త్యాగం, శాంతియుత సహజీవనం అని అన్నారు. ఇవన్నీ తన జీవితం ద్వారా మనావాళికి క్రీస్తు ఇచ్చిన మహోన్నత సందేశాలని చెప్పారు. క్రీస్తు బోధనలు ఎప్పటికీ ప్రజలను సన్మార్గంలో నడిపిస్తాయని ఆయన తెలిపారు. క్రైస్తవులు అందరూ క్రిస్మస్ పండుగ వేడుకలను ఆనందంగా, సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

'టీడీపీ సభ్యత్వంతో కుటుంబానికి అండ'


బి.కోడూరులో సభ్యత్వం చేస్తున్న టీడీపీ నాయకులు

బండిఆత్మకూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తల కుటుంబాలకు కొండంత అండ ఉంటుందని శ్రీశైలం ట్రస్టుబోర్డు మాజీ సభ్యుడు, ఆ పార్టీ టీడీపీ నాయకుడు డాక్టర్ చిట్టిబొట్ల భరద్వాజశర్మ అన్నారు. మండలంలోని బి.కోడూరు గ్రామంలోని పలు కాలనీలలో మంగళవారం టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కేవలం రూ.100 సభ్యత్వం తీసుకోవడం వల్ల రూ.5 లక్షలు ప్రమాద బీమా వర్తిస్తుందని చెప్పారు. అలాగే సోమయాజులపల్లె గ్రామంలో టీడీపీ నాయకుడు అల్లె చెన్నారెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి కంచర్ల చిన్నలింగారెడ్డి, వడ్డె బాలుడు, చలమయ్య, నాగేష్, రమేష్, శ్యామ్, జఫ్రుల్లా, జగదీష్‌రెడ్డి, సోషియల్ మీడియా రసూల్‌ఖాన్ పాల్గొన్నారు.

27న విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన ర్యాలీ


పోస్టరును విడుదల చేస్తున్న వైసీపీ నాయకులు

నందికొట్కూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపు నిరసిస్తూ 'పోరుబాట' పేరుతో ఈనెల 27న నందికొట్కూరులో నిరసన ర్యాలీ, విద్యుత్ అధికారులకు వినతిపత్రం ఇవ్వనున్నట్లు వైసీపీ నాయకులు తెలిపారు. పట్టణంలోని వైసీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు కోకిల రమణారెడ్డి కార్యాలయంలో మంగళవారం ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టరును విడుదల చేశారు. పగిడ్యాల మండల కన్వీనర్ పుల్లా నాగిరెడ్డి, జూపాడుబంగ్లా జడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 5 నెలల్లోనే విద్యుత్ చార్జీలు పెంచి సామాన్యులపై భారం మోపిందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో వైసీపీ పట్టణాధ్యక్షుడు మన్సూర్ అహ్మద్, తువ్వా మల్లారెడ్డి, కౌన్సిలర్ నాయబ్ తిరుమల్‌రెడ్డి, జబ్బార్, తదితరులు పాల్గొన్నారు.

'వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి'


మాట్లాడుతున్న బత్తుల లక్ష్మీకాంతయ్య

గోస్పాడు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల లక్ష్మీకాంతయ్య కోరారు. యాళ్ళూరు గ్రామంలో మంగళవారం వడ్డెరల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోదుడు వడ్డె ఓబన్న జయంతిని జనవరి 11న అధికారికంగా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం జీవో జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. క్వారీలలో పనిచేసే వడ్డెర కార్మికులకు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ22 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, 50 ఏళ్లు నిండిన వడ్డెరలకు పింఛన్ ఇవ్వాలని కోరారు. వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్, సంఘం జిల్లా అధ్యక్షుడు రామసుబ్బయ్య, రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి'


రైతులకు సూచనలు ఇస్తున్న ఏవో విష్ణువర్ధన్‌రెడ్డి

ఆత్మకూరు రూరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతులు రసాయనిక, పురుగు మందుల వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి సూచించారు. ఆత్మకూరు మండలంలో రబీ సీజన్‌లో సాగుచేసిన పంటలకు సంబంధించి బీమా నమోదు చేసుకునేందుకు ఈ నెల 31వ తేది వరకు గడువు పెంచినట్లు తెలిపారు. మండలంలోని కురుకుంద, కొట్టాల చెరువు గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ అనుబంధ అధికారులతో కలిసి 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. రైతులకు పలు సూచనలు చేశారు. పట్టు పరిశ్రమశాఖ అధికారి అరుణ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

'31లోపు పంటల బీమా ప్రీమియం చెల్లించాలి'

కొత్తపల్లి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో వివిధ రకాల పంటలు సాగు చేసిన మండల రైతాంగం ఈ నెల 31లోపు పంటల బీమా ప్రీమియం చెల్లించుకోవాలని ఏవో మహేష్ సూచించారు. మండలంలోని ముసలిమడుగు, శివపురం గ్రామాల్లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఏవో రైతులతో కలిసి క్షేత్ర స్థాయి సందర్శన చేపట్టారు. కార్యక్రమంలో పట్టు పరిశ్రమ అధికారి లింగమూర్తి, రైతు సేవా కేంద్ర సిబ్బంది రవీంద్ర నాయక్, రైతులు పాల్గొన్నారు.

'రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి'


గోకవరంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఉమారాణి

కొత్తపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకొని భూ సమస్యలు పరిష్కరించుకోవాలని తహసీల్దార్ ఉమారాణి రైతులకు సూచించారు. మండలంలోని గోకవరం గ్రామ సచివాలయ ఆవరణలో మంగళవారం తహసీల్దార్ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు భూములకు సంబంధించిన అభ్యంతరాలు ఏమైనా ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ముఖ్యంగా కొలతల్లో తేడాలు, సర్వే నెంబర్లలో మార్పులు, వారసత్వ పేరు నమోదు, సరిహద్దు సమస్యలు, భూవిస్తీర్ణంలో తేడాలు అన్నీ ఆధారాలు ఉన్నప్పటికీ ఎవరైనా భూకబ్జాలు చేస్తే అలాంటి వాటిపై రైతులు దరఖాస్తులు అందజేస్తే క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేస్తామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ అనూషారాణి, వీఆర్వో శ్రీనివాసులు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

గడివేముల(ఆంధ్రజ్యోతి): భూసమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వెంకటరమణ అన్నారు. పెసరవాయి గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరిస్తామని అన్నారు. రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకురాలు వడ్డు లక్ష్మీదేవి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


పెసరవాయిలో అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ వెంకటరమణ

రేపు కబడ్డీ పోటీలు

మిడుతూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మిడుతూరు మండల పరిధిలోని చౌట్కూరు గ్రామంలో క్రిస్మస్ సందర్భంగా ఏబీఎం చర్చి వద్ద గురువారం ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘ పెద్దలు తెలిపారు. మొదటి నాలుగు బహుమతులు వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు అందజేయనున్నట్లు తెలిపారు. రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సంఘ పెద్దలు తెలిపారు.

'భగవద్గీత పఠనం చేయండి'

బండిఆత్మకూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): త్రైత సిద్ధాంత భగవద్గీత పఠనం చేయాలని ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక మిడుతూరు కమిటీ అధ్యక్షుడు రామచంద్రుడు సూచించారు.మంగళవారం మండలంలోని ఎర్రగుంట్ల గ్రామంలో ఆచార్య, ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాల గురించి ప్రచాం కమిటీ సభ్యులు నిర్వహించారు. గోకారి, శ్రీను, సుబ్బలక్ష్మి, సుజాత, హైమావతి, రమణమ్మ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి: సీపీఎం



నిరసన తెలుపుతున్నసీపీఎం నాయకులు, ప్రజలు

ఆత్మకూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని అర్బన్‌కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం నాయకులు రణధీర్, షేక్ ఇస్మాయిల్, భాస్కర్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం వారు కాలనీవాసులతో కలిసి ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అర్బన్‌కాలనీలోని చెంచు కాలనీలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకు నుంచి కొళాయిలకు నీరు రాకపోవడంతో కాలనీవాసులు నీటి కోసం అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా అనేక సందర్భాల్లో విద్యుత్ అంతరాయం కలిగిన రోజుల్లో నీటి సరఫరా జరగక ఇబ్బందులు పడాల్సిన దుస్థితి ఏర్పడిందని చెప్పారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు శిలార్ తదితరులు ఉన్నారు.

కమ్మేసిన పొగమంచు

మిడుతూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మిడుతూరు మండలంలో పొగ మంచు కమ్మేసింది. మిడుతూరు సమీపంలో నందికొట్కూరు నంద్యాల ప్రధాన రహదారిలో మంగళవారం ఉదయం 9 గంటల సమయంలోనే పొగమంచు కమ్ముకుంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.


మిడుతూరు సమీపంలో ఉదయం 9 గంటల సమయంలో కమ్ముకున్న పొగమంచు

'వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి'


నాగలూటి చెంచు గూడెంలో చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యాధికారి

ఆత్మకూరు రూరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): సీజన్ వ్యాధులతో గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని బైర్లూటి వైద్యాధికారి డాక్టర్ గోపాల్ సూచించారు. మండలంలోని నాగలూటి చెంచు గూడెంలో మంగళవారం 104 సిబ్బంది ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి గర్భిణులు, బాలింతలను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అలాగే ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి గిరిజనులకు చికిత్స చేశారు. డాక్టర్ గోపాల్ మాట్లాడుతూ గర్భిణులు తప్పని సరిగా పౌష్టికాహారం తీసుకోవాలని, చిన్నారులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని సూచించారు. ప్రస్తుత సీజన్‌లో దోమలు ప్రబలే ప్రమాదం ఉందని, దోమల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో దీపికాబాయి, ఆరోగ్య సిబ్బంది బేబి జ్యోతి, భాస్కర్, విశ్వనాథ్, రవి పాల్గొన్నారు.


మహానంది: వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యాధికారి

మహానంది(ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతంలో అత్యంత సమీపంలో నివసించే చెంచుగూడెం ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తిమ్మాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి వేణు తెలిపారు. మంగళవారం మహానంది సమీపంలోని లక్ష్మీదేవి చెంచుగూడెంలోని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా చెంచులకు వైద్యాధికారి సీజన్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనారోగ్య పాలైనప్పుడు సొంత వైద్యం చేసుకోకుండా సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్సలు నిర్వహించుకోవాలని సూచించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చలం శిరీష, పీహెచ్ఎన్ అమీనాబాయి, సిబ్బంది హేమలత, సునీత, విజయ పాల్గొన్నారు.

విజేతలకు నగదు బహుమతుల ప్రదానం


విద్యార్థినికి నగదు బహుమతి అందజేస్తున్న జేసీ

పాణ్యం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు చైతన్య సాయిశ్రీ, జ్యోత్స్నకు జిల్లా జాయింట్ కలెక్టరు విష్ణు చరణ్ నగదు బహుమతి అందజేసినట్లు హెచ్ఎం మేరి సునీత తెలిపారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ఈనెల 21 తేదీన నిర్వహించిన జిల్లా స్థాయి వక్తృత్వ పోటీలలో చైతన్యసాయిశ్రీ ప్రథమ బహుమతి రూ. 3 వేలు, వ్యాసరచన పోటీలో జ్యోత్స్న ద్వితీయ బహుమతి రూ. 2 వేలు జేసీతో పాటు, డీఈవో జనార్దన్ నుంచి అందుకున్నారన్నారు. నంద్యాల్ల కలెక్టరేట్‌లో నిర్వహించిన జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా బాలికలకు నగదుతోపాటు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బాలికలను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

శ్రీశైలంలో విశేష పూజలు


భక్తులకు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసిన ఏఈవో




శ్రీశైలంలో పూజలందుకున్న కుమార స్వామి, నందీశ్వర స్వామి, బయలు వీరభద్రస్వామి

శ్రీశైలం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో మంగళవారం పురస్కరించుకుని లోకకళ్యాణార్థం ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్య (కుమారస్వామి), నందీశ్వరస్వామికి, బయలు వీరభద్ర స్వామికి విశేష పూజలు నిర్వహించారు. దేశం శాంతిసౌభాగ్యాలతో విరిసిల్లాలని అర్చకులు సంకల్పం పఠించారు, అనంతరం పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహా గణపతి స్వామికి పూజలు చేశారు. పంచామృతాలతో అభిషేకించి మహా మంగళ హారతులు సమర్పించారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి మంగళవారం నంద్యాలకు చెందిన డి.ప్రభావతమ్మ అనే భక్తురాలు రూ. 1,00,116 విరాళాన్ని సహాయ కార్యనిర్వహణాధికారి జి స్వాములుకు అందజేశారు. దాతకు దేవస్థానం అధికారులు స్వామివారి శేష వస్త్రం, ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

ఆకట్టుకున్న భక్తి గీతాలాపన: ధర్మపథంలో భాగంగా దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో ఒంగోలుకు చెందిన రాఘవ సంగీత కూచిపూడి నృత్యనికేతన్ బృందంతో భక్తి సంగీత కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో గణపతి నమో నమః, శివ శివ, బ్రహ్మమురారిసురార్చిత లింగం, శివాష్టకం, శివస్తోత్రం తదితర గీతాలు, అష్టకాలు కె.సాయిశరణ్య, బి.హారిక, కె జోషిత తదితరులు ఆలపించారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

రీ సర్వే సమస్యల పరిష్కారానికి కృషి

శిరివెళ్ల, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లోని భూముల రీసర్వేలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తహసీల్దార్ పుష్ప కుమారి తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో భాగంగా మండలంలోని గోవిందపల్లె గ్రామంలో రెవెన్యూ అధికారులు మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. రైతుల నుంచి వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి తగిన న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గంగదాసరి శ్రీనివాసరెడ్డి, రవిచంద్రారెడ్డి, లక్ష్మీరెడ్డి, సంగిరెడ్డి నాగేశ్వరరెడ్డి, నాగిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ కిషోర్ కుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

వినియోగదారులు హక్కులు తెలుసుకోవాలి


యర్రగుంట్లలో విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఇంద్రావతి

శిరివెళ్ల, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి) : వినియోగదారులు తప్పనిసరిగా తమ హక్కులను తెలుసుకోవాలని యర్రగుంట్ల గంగుల తిమ్మారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇంద్రావతి అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని కళాశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వినయోగదారుల హక్కులు, బాధ్యతల గురించి వీడియోల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. క్విజ్ పోటీలో ప్రతిభచూపిన విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు గాయత్రి, విజయరేఖ, కుమారి పాల్గొన్నారు.

బెస్తల సంక్షేమానికి ప్రత్యేక కృషి


శిరివెళ్లలో క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న బెస్త సంఘం నాయకులు

శిరివెళ్ల, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి) : బెస్తల(గంగపుత్రుల) సంక్షేమానికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు శిరివెళ్ల మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు, అహోబిలం బెస్త అన్నదాన సత్రం ఉపాధ్యక్షుడు కొండబోయిన బాలచంద్రుడు అన్నారు. శిరివెళ్లలోని తెలుగుపేటలో నూతన సంవత్సర క్యాలెండర్లను మంగళవారం ఆవిష్కరించారు. అహోబిలం లక్ష్మీనృసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మార్చి 13 నుంచి 15వ తేదీ వరకు అన్నదానం చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కొండబోయిన కృష్ణ మోహన్, జగదీష్, బాల తానీషా, చిలకల శివ, నాసరయ్య, అశోక్, బాల లింగమయ్య, నరసింహుడు, చిలకల లింగమయ్య, చింతల నవీన్, సుంకి రాము పాల్గొన్నారు.

డ్రోన్ పిచికారీతో సమయం ఆదా


చక్రవర్తులపల్లెలో రైతులకు అవగాహన కల్పిస్తున్న పశువైద్య సిబ్బంది

రుద్రవరం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : డ్రోన్‌తో పంటలపై పురుగుమందు పిచికారి చేయడంతో సమయం ఆదా అవుతుందని వ్యవసాయాధికారి నాగేంద్ర ప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని ఎర్రగుడిదిన్నె, పేరూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. జొన్న మినుము పంటలపై డ్రోన్‌తో పిచికారీ, యాజమన్యం సస్యరక్షణ ఎద్దతులపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగేపంటలకు వచ్చే బీమా ఈ నెలా 31 వరకు గడువు పెంచడం జరిగిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆత్మ ప్రాజెక్టు ఏపీయం హరిబాబు, రైతు సేవాకేంద్రాలసిబ్బంది గ్లోరీ, భవాని పాల్గొన్నారు.

పశువుల వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులు పశువుల వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సంచార పశుఆరోగ్య సేవ పశువైద్యాధికారి లక్ష్మీప్రసన్న తెలిపారు. మంగళవారం తోడెండ్లపల్లె, చక్రవర్తులపల్లె గ్రామాల్లో మొబైల్ వాహనం ద్వారా పశువులకు వచ్చే వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించారు. అత్యవసర చికిత్సలను మొబైల్ వాహనం దారా చికిత్సలు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో పారామెట్ మహమ్మద్ జూబేర్, పైలెట్ గౌస్, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలను తగ్గించాలి


డోన్‌లో పోరుబాట పోస్టర్లను విడుదల చేస్తున్న వైసీపీ నాయకులు

డోన్ రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలను తగ్గించాలని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, జిల్లా వలంటరీ విభాగపు అధ్యక్షుడు పోస్టు ప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో మంగళవారం పోరుబాట పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచి ప్రజల నడ్డీ విరుస్తుందన్నారు. వీటికి నిరసనగా వైసీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుశేన్, సింగిల్ విండో మాజీ చైర్మన్ సోమేష్ యాదవ్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

సంక్రాంతి నాటికి ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ బనగానపల్లె పట్టణాన్ని పూర్తిగా ప్లాస్టిక్‌ను నిర్మూలించి, క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో చేపట్టిన కార్యక్రమానికి ప్రజలనుంచి, అసోసియేషన్ సభ్యులనుంచి స్పందన లభిస్తోందన్నారు. గత రెండు నెలలుగా పట్టణంలో ప్లాస్టిక్ నియంత్రణకు ప్రచారం చేస్తున్నామన్నారు. కిరాణా, క్లాత్ మర్చంట్, మెడికల్, హోటళ్లు, ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వాడకంపై బ్యాన్ చేస్తున్నట్లు స్వచ్ఛందంగా ప్రకటించినట్లు ఆమె తెలిపారు. ఈసందర్భంగా బీసీ ఇందిరమ్మ గ్రీన్ క్యాపులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రపంచ ఆర్యవైశ్య మహా సభ నంద్యాల జిల్లా అధ్యక్షుడు టంగుటూరు శ్రీనయ్య, హోటల్ అసోసియేషన్ అధ్యక్షుడు హైదర్ మండే, మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కాశ్రావణ్‌కుమార్, గోల్డ్ షాప్ అసోసియేషన్ అధ్యక్షుడు నిజముద్దీన్, మెడికల్ స్టోర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బొంతలఫణీంద్ర, ఎలక్ట్రికల్ అసోసియేషన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, క్లాత్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయిరం, టీచర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


చర్చిల్లో క్రిస్మస్ శోభ


చాగలమర్రిలో ఆర్సీఎం చర్చి


రుద్రవరంలో ముస్తాబైన చర్చి


జిల్లాలో బుధవారం జరిగే క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబయ్యాయి. దయామయుడైన దైవకుమారుడు యేసు క్రీస్తు జనించిన సు దినం ఇది. ప్రతి చర్చిలో వెలుగు పూలు విరబూశాయి. బాలయేసు రాకను సూచిస్తూ విద్యుత్‌దీపాలతో ఏర్పాటు చేసిన స్టార్లు, క్రిస్మస్ ట్రీలతో సరికొత్త శోభను సంతరించుకున్నాయి. మంగళవారం రాత్రి నుంచి ప్రత్యేక ప్రార్థనలు ఆరంభించారు. అర్ధరాత్రి 12 గంటల వేల క్రిస్మస్ గడియల సమీస్తున్న తరుణంలో మందిరాల్లో విశ్వాసులు ప్రార్థనలు చేసే ప్రభువును స్వాగతించారు.


ప్రార్థనలకు సిద్ధమైన చర్చి



రూపనగుడిలో విద్యుత్ దీపాలతో అలంకరించిన సీఎస్ఐ చర్చి


చాగలమర్రి సెయింట్ జోసఫ్ చర్చిలో ఏర్పాటు చేసిన పశువుల కొట్టం


బెలుంలో సీఎస్ఐ చర్చి


డోన్ పాతబస్టాండులో విద్యుద్దీపాలతో సీఎస్ఐ చర్చి


బనగానపల్లెలో ముస్తాబైన మదర్‌థెరిసా చర్చి


సంజామలలో

కౌన్సిలర్ల తీర్మానం లేనిదే పనులు చేయరాదు

● చైర్మన్ చలంరెడ్డి


మాట్లాడుతున్న చైర్మన్ చలంరెడ్డి

బేతంచెర్ల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలో కౌన్సిలర్ల తీర్మానం లేనిదే ఏ పనీ చేయరాదని నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి అన్నారు. మంగళవారం నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ చలంరెడ్డి అధ్యక్షతన కౌన్సిలర్ల సర్వసభ్య సమావేశం కమిషనర్ హరిప్రసాద్ నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ ఇబ్రహీం మాట్లాడుతూ నగర పంచాయతీకి సంబంధించిన స్థలాలను ఇతరులు అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారని, నగర పంచాయతీ స్థలాలకు సంబంధించి కంచెలు ఏర్పాటు చేయాలని సభ దృష్టికి తెచ్చారు. టీడీపీ వారు కౌన్సిలర్ పోలూరు ఆదిలక్ష్మి మాట్లాడుతూ మావార్డులో రోడ్లు లేవని, 12 రోజుల నుంచి తాగునీరు రావడం లేదని చైర్మన్, కమిషనర్ల దృష్టికి తెచ్చారు. వార్డుల్లో డ్రైనేజీ కాలువలు శుభ్రం చేయకపోవడంతో దోమల బెడద అధికంగా ఉందని, వాటి నివారణకు ఫాగింగ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా వార్డుల కౌన్సిలర్లు కోరారు. పట్టణంలోని బైటిపేట ప్రజలకు మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేశామని, టీడీపీ నాయకులు ఒకటో వార్డులో ఉన్న బోరు నుంచి పైపులేని మినరల్ వాటర్ ప్లాంటు ద్వారా నీటి సరఫరా చేస్తామనడం హాస్యాస్పదంగా ఉందని ఆ పని చేయడానికి కౌన్సిలర్ల తీర్మానం తప్పనిసరిగా ఉండాలని చైర్మన్ తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

స్వల్పకాలిక పంటలతో అధిక లాభాలు

కొలిమిగుండ్ల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రబీలో శనగ సాగుకు ముందు స్వల్పకాలిక పంటలు సాగు చేయడంతో అధిక లాభాలు సాధించవచ్చునని నంద్యాల జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వైవీ మురళీ కృష్ణ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కమ్మవారిపల్లె గ్రామంలో జిల్లా అధికారి, ఏడీఏ సుధాకర్, ఏవో భూమా జ్యోతి పర్యటించారు. గ్రామ రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, పలు రకాల పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. ఖరీఫ్ సాగులో కొర్ర, మినుము, సోయా తదితర చిరుధాన్యాల పంటలను సాగు చేయడం ద్వారా పెట్టుబడులు తగ్గడం, దిగుబడులు పెరగడంతో అధిక లాభాలు ఉంటాయని డీఏవో వివరించారు. అనంతరం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గ్రామ సమీపంలోని శనగ పంట పొలాలను పరిశీలించారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలని రైతులను కోరారు. కార్యక్రమంలో ఏఈవో నాగరాజు వీఏలు సుబ్రహ్మణ్యం, వనిత, చిన్నయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరిస్తాం

సంజామల, డిసెంబరు 24: మండలంలో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరిస్తామని డిప్యూటీ కలెక్టర్ రాంభూపాల్ రెడ్డి రైతులకు హామీ ఇచ్చారు. మంగళవారం గిద్దలూరు గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆర్డీవో విశ్వనాథ్, తహసీల్దార్ అనిల్ కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూ సమస్యలకు సంబంధించి వచ్చిన పలు వినతులను ఆయన స్వీకరించారు. ఆర్వోఆర్, 1బిలో పేర్లు నమోదు కాని వారు భూ వ్యత్యాసాలు సంబంధిత కొలతలకు సంబంధించి దరఖాస్తులను అందజేశారు. దరఖాస్తులు పరిశీలించిన ఆయన వేగవంతంగా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ క్రిష్ణయ్య, మల్లేశ్వరీ, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చాగలమర్రి: గ్రామాల్లో రైతుల భూసమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. భూ సమస్యలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం రైతుల నుంచి భూసమస్యలపై అర్జిలను స్వీకరించారు. కార్యక్రమంలో సర్వేయర్ మద్దిలేటి, ఆర్ఐ అబ్దుల్‌సత్తార్, కార్యదర్శి చిన్నబ్బి, వీఆర్వోలు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: రైతులు దరఖాస్తు చేసుకున్న అర్జీలను పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామనితహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం కోవెలకుంట్ల పరిధిలోని రేవనూరు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న భూసమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని అన్నారు.

'కార్యకర్తల సంక్షేమానికి టీడీపీ పెద్దపీట'


ప్యాపిలి మండలంలోని మునిమడుగులో సభ్యత్వం నమోదులో పాల్గొన్న అలేబాదు పరమేష్

ప్యాపిలి, నవంబరు 24: కార్యకర్తల సంక్షేమానికి టీడీపీ పెద్దపీట వేస్తుందని టీడీపీ నంద్యాల పార్లమెంటు ప్రధాన కార్యదర్శి అలేబాదు పరమేష్ అన్నారు. మంగళవారం మండలంలోని మునిమడుగు గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. పరమేష్ మాట్లాడుతూ సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలు పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు ప్రమాద బీమా సౌకర్యం కూడా కల్పించడం జరుగుతుందన్నారు. కాబట్టి కార్యకర్తలందరూ సభ్యత్వం తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో నాయకులు హరికుమార్, ఖాసీం, నారాయణ, బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

దీక్షలకు సీపీఎం మద్దతు

కొలిమిగుండ్ల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బందార్లపల్లె రాయల్టీ చెక్‌పోస్టు వద్ద నాపరాయి పరిశ్రమ వర్గాలు చేపడుతున్న దీక్షలకు జిల్లా సీపీఎం నాయకులు మంగళవారం సంఘీభావం తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి దావీదు తదితరులు దీక్షా శిబిరాన్ని సందర్శించారు. సంక్షోభంలో ఉన్న నాపరాయి పరిశ్రమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిశీలించి, న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

అక్రమ కట్టడాలకు నోటీసులు ..

కొలిమిగుండ్ల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రమైన కొలిమిగుండ్లలోని పలు అక్రమ కట్టడాలకు రెవిన్యూ అధికారులు మంగళవారం నోటీసులు అంటించారు. సర్వే నెంబరు 112-ఏ, 759, 738, 763, 765 తదితర ప్రాంతల్లో కొందరు అక్రమంగా గోడలు నిర్మించారని, వీటిని తొలగించడానికి రెవిన్యూ అధికారుల ఆదేశాలమేరకు నోటీసులు అంటిస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. నిర్మాణాలు చేపట్టిన వ్యక్తులు రెండు రోజుల్లో వారి వద్ద ఎవైనా పత్రాలు ఉంటే తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని, లేనిచో నిర్మాణాలను తొలగిస్తామని నోటీసులో తెలియజేశారు.

రాష్ట్రానికి మంచి పేరు తేవాలి: డోన్ డీఎస్పీ


క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న అందజేస్తున్న డీఎస్పీ

డోన్ రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో జరుగుతున్న పోటీల్లో అత్యంత ప్రతిభను కనబరిచి పతకాలు సాధించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని డోన్ డీఎస్పీ శ్రీనివాసులు ఆకాంక్షించారు. రాష్ట్రంలో వివిధ జిల్లాల నుంచి నిర్వహిస్తున్న బాల్ బ్యాడ్మింటన్ శిక్షణ పోటీలు మంగళవారం ముగిశాయి. క్రీడాకారులకు డీఎస్పీ సొంత ఖర్చులతో క్రీడాదుస్తులు, బాల్ బ్యాడ్మింటన్ క్రీడా సామగ్రిని అందజేశారు. 26 నుంచి 29వ తేదీ వరకు మహారాష్ట్రలోని ముంబైలో జరిగే జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ క్రీడలకు ఎంపికైన క్రీడాకారులకు డోన్‌లో ప్రత్యేంగా శిక్షణ ఇచ్చారు.

● క్రీడాకారిణులను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ కలిసి అభినందించారు. ఆయన మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్యక్రమంలో డోన్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు కామేష్, రాంకి, రామ్మోహన్, చంద్రారెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ

బేతంచెర్ల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు నగర పంచాయతీ కార్యాలయంలో నూతన దుస్తులతో పాటు సబ్బులను మంగళవారం పంపిణీ చేశారు. ప్రతి ఏటా నగర పంచాయతీ కార్యాలయం తరపున పారిశుధ్య కార్మికులకు నూతన దుస్తులతో పాటు కిట్లు పంపిణీ చేయడం జరుగుతుందని నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, కమిషనర్ హరిప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో సిబ్బంది కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

బనగానపల్లె, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందాచారి పిలుపునిచ్చారు. బనగానపల్లె మండలంలోని బీరవోలు ఎస్సీ కాలనీ యందు అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాల్యవివాహాల నిర్మూలన, బాలికల విద్య ఆవశ్యకతపై అవగాహన సదస్సు నిర్వహించారు. బ్రహ్మానందాచారి మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలు, బాలికల విద్యవల్ల కలిగే లాభాలు గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మద్దమ్మ, గర్భిణులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం


ఆలయాధికారులకు చెక్కు అందజేస్తున్న దాతలు

బనగానపల్లె, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలంలోని నందవరం చౌడేశ్వరీ మాత ఆలయాభివృద్ధికి కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన దాతలు మంగళవారం రూ.50,1116లు ఆలయ ఈవో కామేశ్వరమ్మ, ఆలయ మాజీ చైర్మన్‌కు రూ..50,116 విరాళం అందించారు. ఆలయాభివృద్ధికి ఈమొత్తాన్ని వెచ్చించాలని దాతలు కోరారు.

ఘనంగా వినియోగదారుల జాతీయ దినోత్సవం

డోన్ రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం డోన్ కోర్టు ప్రాంగణంలో జరిగిన జాతీయ వినియోగదారుల దినోత్సవం కార్యక్రమంలో ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జడ్జి జ్యోతి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వినియోగదారుల చట్టాలపై ప్రజల్లో అవగాహన పెరగాలన్నారు. కార్యక్రమంలో డోన్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్ గౌడు, న్యాయవాదులు, సమగ్ర వినియోగదారుల సంక్షేమ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, సామాజిక కార్యకర్త మహ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

కొలిమిగుండ్ల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బెలుం గ్రామంలో క్రిస్మస్ వేడుకలు పురస్కరించుకొని సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను మంగళవారం ప్రారంభించారు. సంఘ పెద్దల ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా, కర్నూలు, నంద్యాల తదితర ప్రాంతాల నుంచి మొత్తం 28 జట్లు పోటీలకు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు పెద్దమద్దయ్య, వెలుగు శేఖర్, తోక చిన్నఏసయ్య మద్దిలేటి పాల్గొన్నారు.

సమయపాలన సచివాలయ ఉద్యోగులు పాటించాలి

రుద్రవరం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సమయపాలన సచివాలయ ఉద్యోగులు పాటించాలని ఎంపీడీవో భాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని కోటకొండ, యల్లావత్తుల చిన్నకంబలూరు సచివాలయాలను ఎంపీడీవో తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి ప్రతి రికార్డు అప్‌డేట్‌గా ఉండాలని సూచించారు. మిస్సింగ్‌సిటిజన్ సర్వే, ఎంఎస్ఎంఈ సర్వే, పీఎసీఎస్ ఈకేవైసీ సర్వే వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు నరసింహ వర్మ, పాములేటి పాల్గొన్నారు.

'వినియోగదారుడే ఉత్పత్తిదారుడు'


సోలార్‌పై అవగాహన కల్పిస్తున్న విద్యుత్ ఏడీ, ఏఈ

చాగలమర్రి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా గృహ వినియోగారుడు విద్యుత్ ఉత్పత్తి దారుడిగా మారే అవకాశం కలుగుతుందని ఆళ్లగడ్డ విద్యుత్‌శాఖ ఏడీఈ రవికాంత్‌చౌదరి తెలిపారు. మంగళవారం చాగలమర్రి గ్రామంలోని ఫరూక్ అనే వినియోగదారుడు ఏర్పాటు చేసుకున్న సోలార్ రూఫ్‌టాప్‌లను పరిశీలించి విద్యుత్ మీటర్లను ఏర్పాటు చేయించారు. ఆళ్లగడ్డలో 10 సోలార్ రూఫ్‌టాప్‌లను ఏర్పాటు చేసుకున్నారని, 150 మంది దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈ షాజహాన్ ఉన్నారు.

ఘనంగా ఇమ్మానుయేల్ చర్చి వార్షికోత్సవం


చర్చిలో క్యాండిల్ సర్వీస్

చాగలమర్రి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని కేరళ వైద్యశాలలో ఏర్పాటు చేసిన ఇమ్మానుయేల్ చర్చి వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. చర్చి ప్రతిష్టించి 34 ఏళ్లు పూర్తికావడంతో చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫాదర్లు ఏటీస్‌మ్యాటివ్, ఆనందరావులు, వైద్యులు ప్రకాష్, మహిళలు పాల్గొన్నారు.